క్లుప్తంగా

తప్పుల తడకగా కులగణన



మాట్లాడుతున్న మహేందర్

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పుల తడకగా ఉందని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో బీసీల జనాభా తగ్గినట్లు చూపించారన్నారు. బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథం, రాష్ట్ర కార్యదర్శి జంగిటి నిఖిల్, కార్యవర్గ సభ్యులు అభిషేక్, అశోక్ పాల్గొన్నారు.

11న విద్యుత్ వినియోగదారుల సదస్సు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఈనెల 11న విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ చైర్‌పర్సన్ ఎన్వీ వేణుగోపాలచారి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యలు లోకల్ కోర్టులో పరిష్కరించుకునేందుకు ఈ సమావేశం దోహదపడుతుందన్నారు. కాలిపోయిన విద్యుత్ మీటర్ల పునరుద్ధరణ, లో వోల్టేజీ, హెచ్చుతగ్గులు పరిష్కారం, డిస్ట్రిబ్యూటర్ సిస్టం పెంపుదల, లోపాలున్న మీటర్లు మార్చుట, నూతన సర్వీస్ మంజూరు అదనపు లోడు క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు మార్పు, వాడకాని కన్నా ఎక్కువగా వచ్చిన బిల్లులు, కేటగిరీలో మార్పు, సర్వీస్ రద్దుకు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశానికి సభ్యులు రమేశ్, చరన్‌దాస్, రామారావు హాజరవుతారన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ హరిహర క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు రెండోరోజు ఆదివారం కొనసాగాయి. ఉదయం మూల విగ్రహాలకు ప్రాతఃకాల పూజ, స్నాపిత కలశస్థాపన, మహాస్నాపన పూజ, అభిషేకాలు చేశారు. రిటైర్డ్ తహసీల్దార్ భగవంతరావు, అభిషేక్ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, చందన తాంబాలం సమర్పించారు. హైకోర్టు న్యాయవాది ఎరబాటి అశోక్‌రావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. నిర్వాహకులు ఎరబాటి రాజేశ్వర్‌రావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పులి కిషన్‌రెడ్డి, రఘుపతిరావు, పురంరాజు, మెట్టు శ్రీశైలం, నార్ల రాజన్న, నర్సింహారెడ్డి, బూర్ల రవి, అభిషేక్, టి.ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ: చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివారం యైటింక్లయిన్‌కాలనీ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో 20న హైదరాబాద్‌లో చేపట్టనున్న మహా ప్రదర్శనలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. మేరీ, శారద, రాములు, లక్ష్మి, అనసూయ, లింగయ్య, భాగ్యలక్ష్మి, సదానందం, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రామగుండం: రామగుండం (లింగాపూర్) పట్టణంలోని మోడల్ (ఆదర్శ) విద్యాలయంలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 23 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆదివారం ఆదర్శ ప్రిన్సిపాల్ పంబాల సదానందం తెలిపారు. ఏటా నిర్వహించే స్కాలర్‌షిప్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అధికంగా రామగుండం మోడల్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 8వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు ఎన్‌ఎంఎంఎస్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందుతాయన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్: నమ్ముకున్న వారి కోసం ఎన్ని కష్టాలైనా ఓర్చి వారి సంక్షేమం కోసం పనిచేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం సుల్తానాబాద్‌లోని శాస్త్రినగర్ కాలనీవాసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శాస్త్రినగర్‌లోని ప్రజల కోరిక మేరకు సర్వే నంబర్ 278లో ఉన్న 30 గుంటల భూమిని 229 సర్వేనంబర్ లోకి బదిలీ చేయడంతో కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చేశామని పేర్కొన్నారు. రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఉచిత వైద్యసేవలను వినియోగించుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామంలో మెడికవర్, మెడిలైఫ్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. కాగా, శిబిరంలో షుగర్, బీపీ, 2డీ ఎకో పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి

పెద్దపల్లిరూరల్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం నిమ్మనపల్లిలోని పల్లవి స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ అకాడమీని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు క్రీడాపోటీలు దోహదపడతాయన్నారు. పాఠశాలలో వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఖోఖో, ఆర్చరీ, స్విమ్మింగ్, స్కేటింగ్ లాంటి ఆటలను ప్రారంభిస్తున్నట్లు కరస్పాండెంట్ శోభారాణి తెలిపారు. ఆసక్తిగల వారు 96763 87766, 98491 22772 నంబర్లలో సంప్రదించాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య, గ్రంథాలయసంస్థ జిల్లా చైర్మన్ అన్నయ్య, నాయకులు మల్లయ్య, శ్రీనివాస్, సురేశ్‌గౌడ్ తదితరులున్నారు.

ఫోర్‌లేన్ రోడ్డుపై పేరుకుపోతున్న మట్టి

- పట్టించుకోని రహదారి నిర్వహణ సంస్థ



రోడ్డుపై పేరుకుపోయిన మట్టి

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ఎస్సారెస్పీ కాలువ మూలమలుపు వద్ద ఫోర్‌లేన్ రహదారిపై మట్టి పేరుకుపోయి ప్రమాదకరంగా మారింది. దీన్ని తొలగించాల్సిన ఫోర్‌లేన్ రహదారి నిర్వహణ సంస్థ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో రహదారిపై ప్రయాణించే ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలబారిన పడుతున్నారు. కన్నాల టోల్‌గేట్ వద్ద వాహనాలకు చెల్లించాల్సిన రుసుం తప్పించుకునేందుకు కొంతమంది వాహనదారులు పక్కనే గల జీడీనగర్‌కు వెళ్లే దారిగుండా వాహనాలను మళ్లించి డి–83 ఎస్సారెస్పీ కెనాల్ మీదుగా బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ వరకు ప్రయాణిస్తూ మళ్లీ ఫోర్‌లేన్ రహదారికి వస్తున్నారు. టోల్‌గేట్ రుసుం తప్పించుకునేందుకు ఏర్పాటు చేసుకున్న ఈరహదారి గుండా నిత్యం పదుల సంఖ్యలో లారీలు, ఇతర వాహనాలు ప్రయాణిస్తున్నాయి. పోలీస్‌స్టేషన్ సమీపంలోని మూలమలుపు వద్ద ఫోర్‌లైన్ రహదారిపైకి వాహనాలు వచ్చే క్రమంలో తీవ్రమైన దుమ్ము లేస్తోంది. ప్రస్తుతం ఈ దుమ్మంతా పేరుకుపోయి మట్టికుప్పలా ఏర్పడింది. నిత్యం వాహనాల రాకపోకలతో బిజీగా ఉండే ఫోర్‌లేన్ రహదారిపై పేరుకుపోయిన మట్టికుప్ప మూలంగా వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. రాత్రివేళల్లో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. రహదారిపై పేరుకుపోయిన మట్టిని ఎప్పటికప్పుడు తొలగించాల్సిన రహదారి నిర్వహణ సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు రహదారి నిర్వహణ విషయంలో తగిన చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు, రహదారి నిర్వహణ కాంట్రాక్ట్ సంస్థ అధికారులు స్పందించి రహదారిపై పేరుకుపోయిన మట్టికుప్పను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు చేసిందేంటి?



మాట్లాడుతున్న మహంకాళి స్వామి

గోదావరిఖని: పదేళ్లపాటు అధికారంలో ఉండి చేయలేని అభివృద్ధి పనులను తాము చేస్తుంటే బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేక విమర్శలకు దిగుతున్నారని కాంగ్రెస్ నాయకుడు మహంకాళిస్వామి అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యేలు సోమారపు సత్యనారాయణ, కోరుకంటి చందర్ అభివృద్ధిని మరిస్తే తమ ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ రద్దీగా ఉండే లక్ష్మీనగర్, కళ్యాణనగర్ ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దాలనే ఆకాంక్షతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారన్నారు. ఈప్రాంత అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారన్నారు. బుధవారం జీఎం కార్యాలయం నుంచి చౌరస్తా వరకు రోడ్డు పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు గాంధీ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు ప్రారంభమవుతాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, మారెల్లి రాజిరెడ్డి, తిపారపు శ్రీనివాస్, బొమ్మక రాజేశ్, ముస్తఫా, పెద్దెల్లి ప్రకాశ్, గట్ల రమేశ్, యుగేందర్, కొప్పుల శంకర్, అల్లి శంకర్, మాలెం మధు పాల్గొన్నారు.

ఆలయాల్లో పట్నాలు, ప్రత్యేక పూజలు



జూలపల్లి మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న భక్తులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలో గల శ్రీఆదివరాహస్వామి, జూలపల్లిలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయాలు ఆదివారం భక్తులతో కోలాహలంగా మారాయి. ఆదివరాహస్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మల్లన్న ఆలయంలో భక్తులు ఒగ్గు పూజారులతో స్వామివారికి పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు.

ఎరుకల ప్రజాసమితి కమిటీ నియామకం



నియామక పత్రం అందుకుంటున్న నాయకులు

గోదావరిఖని: ఎరుకల ప్రజాసమితి రామగుండం నియోజకవర్గ నూతన కమిటీని ఆదివారం ప్రకటించారు. నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా మానుపాటి స్వామి, ఉపాధ్యక్షుడు రేవెల్లి కొమురయ్య, ప్రధాన కార్యదర్శి సార్ల తిరుపతి, సహాయ కార్యదర్శి కర్ర జంపయ్య, ప్రచార కార్యదర్శి రేవెల్లి ఓదెలు, మానుపాటి శివను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కె.తిరుపతి పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

• నేడు ఆలయంలో రుద్రాభిషేకం

జూలపల్లి: మండల కేంద్రంలోని అత్యంత ప్రాముఖ్యత కలిగిన శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి ఉద్దండ నవీన్ తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు తీసుకోవాలన్నారు.

• రహదారికి మరమ్మతు చేయాలి

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేట గ్రామ చౌరస్తా నుంచి కోల్ కారిడార్(రైల్వే గేట్) వరకు ఉన్న రహదారికి మరమ్మతు చేయాలని మండల కేంద్రానికి చెందిన పలువురు ఆదివారం ఆర్జీ–2 జీఎంకు వినతిపత్రం అందజేశారు. రహదారి పూర్తిగా గుంతలు పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని సింగరేణి ప్రభావిత గ్రామమైన రహదారిని సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మరమ్మతు చేపట్టి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

• రామభద్ర ఆలయంలో పూజలు

ఓదెల: మండలంలోని గుంపులలో మానేరు పక్కన గల రామభద్ర ఆలయంలో వరంగల్ మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య ఆదివారం పూజలు చేశారు. ఆలయంలోని శ్రీరాముడిని దర్శనం చేసుకున్నారు. ఆలయ పూజారి మాజీ ఎంపీకి హారతిచ్చి తీర్థ ప్రసాదాలు అందించారు.

తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం వాహనం

మంథని: మండలంలోని నాగారం శివారులో అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. అందిన సమాచారం మేరకు అక్రమంగా ప్రజా పంపిణీ బియ్యాన్ని రవాణా చేస్తున్నారని పౌరసరఫరాల శాఖ అధికారితో కలిసి నాగారం గ్రామ శివారు వద్ద ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆటో ట్రాలీని సోదా చేయగా అందులో ప్రజా పంపిణీ బియ్యం 20 సంచుల్లో ఎలాంటి అనుమతి లేకుండా రవాణా చేస్తున్నారు. పట్టుబడిన బియ్యం 9 క్వింటాళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.



నిరుపయోగంగా ఎస్సారెస్పీ కాలువ

రామగుండం: మెట్ట ప్రాంతాల్లోని ఎస్సారెస్పీ కాలువలు పూర్తిగా శిథిలావస్థకు చేరి ముళ్లపొదలతో నిండిపోయాయి. అంతర్గాం మండల పరిధిలోని విలేజ అంతర్గాం-పెద్దంపేట గ్రామాల మధ్య నూతనంగా మూడో రైల్వేట్రాక్ నిర్మాణం జరిగిన సమయంలో ఎస్సారెస్పీ కాలువ కనెక్టివిటీ తెగిపోయింది. కాగా ఇరువైపులా పంట పొలాలకు ఎత్తిపోతలతో పైపులైన్లు వేసుకొని సాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. దీంతో కాలువలు నిరుపయోగమయ్యాయి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్ జెడ్పీ పాఠశాలలో 1993–94లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన అప్పటి గురువులు కేదారి ఐలయ్య, ఓరుగంటి రవీందర్, స్వామిని సత్కరించారు. పూర్వ విద్యార్థులు కాసివొజ్జుల వీరచారి, ఎం.శంకర్, నిమ్మతి రాజేందర్, మహేందర్, స్వప్న, స్వరూప, తాత పోచమల్లు, కళ్యాణపు లింగమూర్తి, ఇరిగేసి రవీందర్‌రావు, ఈర్ల మల్లేశ్ పాల్గొన్నారు.



పెద్దపల్లిరూరల్: నిరుపేద, మధ్య తరగతి ప్రజలు తమ ఇళ్లలో జరిగే ఫంక్షన్లు నిర్వహించుకునేందుకు వీలుగా దాదాపు దశాబ్దకాలం క్రితం నిర్మించిన షాదీఖానా భవనం నిరుపయోగంగా మారింది. పట్టణ శివారులోని చందపల్లి శివారులో అప్పటి ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి ప్రత్యేక చొరవ చూపి నిర్మించిన షాదీఖానా భవనం వినియోగంలోకి తెస్తే ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన వంటపాత్రలు అందుబాటులో లేకపోవడంతో ఈ భవనాన్ని వినియోగించుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫోటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

క్రీడలతో కార్మికుల్లో స్నేహ సంబంధాలు



షీల్డు అందిస్తున్న కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి

జ్యోతినగర్: క్రీడలతో కార్మికుల్లో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు సీనియర్ కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. వివిధ కంపెనీలకు చెందిన కాంట్రాక్ట్ కార్మికుల క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు విధి నిర్వహణతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించేందుకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు స్టేజ్–1లో విద్యుత్ ఉత్పత్తిలో భాగస్వామ్యంతో పాటు క్రీడాపోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన హెచ్‌ఈఎంఎస్ జట్టు, ద్వితీయ బహుమతి సాధించిన వోల్టెక్ జట్టు సభ్యులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈఎంఎస్, వోల్టెక్ సైట్ ఇన్‌చార్జిలు హరీశ్, అరుణ్‌కుమార్ యాదవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

'బండ'బాటు



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంలోని సండే మార్కెట్‌లో చాలామంది అమ్మకందారులు తూకం బాట్లు లేకుండా రాళ్లు, ఇటుకలు, ఇనుప బిల్లలు ఉపయోగిస్తూ కూరగాయలు విక్రయిస్తున్నారు. కొలతలు సరిగా లేకుండా తూకం వేయడంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు. తూనికలు, కొలతల అధికారులు తనిఖీ చేయకపోవడంతో అమ్మకందారులు పాత త్రాసులు, రాళ్లను ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు.

అంబేడ్కర్, పూలే ఆశయ సాధనకు కృషి చేయండి



పూలమాల వేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రతీఒక్కరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కోకన్వీనర్ ఆకునూరి బాలంకూస్ అన్నారు. ఆదివారం మహాత్మా జ్యోతిరావుపూలే, అంబేడ్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా యైటింక్లయిన్‌కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ చౌరస్తా వద్ద గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. శంకర్, కమలాకర్, తిరుపతి, ఉదయ్‌కుమార్, చక్రపాణి, శ్రీనివాస్, రాజేశ్, సారయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘం నాయకులకు సన్మానం

గోదావరిఖనిటౌన్: ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులను స్థానిక అశోక్‌నగర్‌లోని జమా మసీద్‌లో మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విజిట్ అవర్ మసీద్ కార్యక్రమంలో భాగంగా సన్మానించారు. సంఘం నాయకులు పెద్దపల్లి సెషన్స్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది మారెె కిషోర్, సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేశ్, ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేశ్‌బాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ నవాబ్‌ను మసీదు కమిటీ సభ్యులు అబ్దుల్ రాహు, అబ్దుల్లా, జావీద్, ఫారూక్, ఫయాజ్, హకీమ్ ఉన్నారు.

బ్రాస్ బ్యాండ్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక

సుల్తానాబాద్: బ్రాస్ బ్యాండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడిగా బూర్గు శ్రీకాంత్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.సాహెబ్ హుస్సేన్ ప్రకటించారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికలు నిర్వహించగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కొత్తూరు చంద్రబాలయ్య, కాలువల సమ్మయ్య, కార్యదర్శిగా ఎండీ జహంగీర్, సహాయ కార్యదర్శిగా మైలారం సంపత్, కోశాధికారిగా సీహెచ్ గోపాల్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా రాజేశం, రవి, శ్రీను, మోహన్, శ్రీను, గౌరవ అధ్యక్షులుగా పారుపల్లి గుణపతి, సలహాదారులుగా మొండయ్యగౌడ్ వ్యవహరించనున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా రోడ్డు



ఓదెల: మండలంలోని కొలనూర్ నుంచి ఓదెల వరకు రూ.36కోట్లతో తారు రోడ్డు వేశారు. కానీ వర్షాకాలంలో వరద ఉధృతికి రోడ్డు కోతకు గురికావడంతో ప్రమాదకరంగా మారింది. రాత్రి పూట ప్రయాణికులు అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.